

'ట్రాక్' తప్పినట్టేనా?

ఖమ్మం పటేల్ స్టేడియంకు మంజూరైన అథ్లెటిక్స్ సింథటిక్ పనులు ప్రారంభం కాకపోవడంతో క్రీడాకారులు నిరాశ చెందుతున్నారు. 8లో



డిజిటల్ అరెస్ట్ పేరిట స్వాహా

రిటైర్డ్ ఉద్యోగిని డిజిటల్ అరెస్ట్ పేరిట బెదిరించిన సైబర్ నేరగాళ్లు రూ.15లక్షలను వారి ఖాతాకు జమ చేయించుకున్నారు. 8లో



వాతావరణం

జిల్లాలో ఆదివారం కనిష్టస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది. ఉదయం, రాత్రి చలి తీవ్రత ఉంటుంది.

న్యూస్‌రీల్

జమలాపురంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి మూలవిరాట్‌తో పాటు ఆలయ ఆవరణలోని శ్రీవారి పాదానికి అర్చకులు పంచామృతంతో అభిషేకం జరిపించారు. ఆతర్వాత స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించి నిత్యకల్యాణం జరిపించగా, వేలాది మంది భక్తుల సమక్షాన పల్లకీ సేవ చేశారు. ఆలయ చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్ర మూర్తి, ఈఓ కె.జగన్మోహన్‌రావు, సూపరింటెండెంట్ విజయకుమారితో పాటు అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై 12న విచారణ

ఖమ్మంమయూరిసెంటర్: ఎస్సీ వర్గీకరణపై రాష్ట్రప్రభుత్వం నియమించిన ఏక సభ్య కమిషన్ ఈనెల 12న ఖమ్మంలో బహిరంగ విచారణ చేపట్టనుందని ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ తెలిపారు. ఖమ్మం కలెక్టరేట్‌లో జరిగే విచారణలో కమిషన్ చైర్మన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అఖ్తర్ పాల్గొంటారని వెల్లడించారు. ఈమేరకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలోని ఎస్సీ కుల సంఘాల ప్రతినిధులు హాజరై తమ వివరణ ఇవ్వాలని సూచించారు. ఈ విచారణ 12వ తేదీన ఉదయం 11నుండి మధ్యాహ్నం 2 గంటలకు ఉంటుందని డీడీ తెలిపారు.

పాడి పరిశ్రమతో ఆర్థికాభివృద్ధి




మాట్లాడుతున్న వెంకటనారాయణ

ముదిగొండ: రైతులు వ్యవసాయంతో పాడి పరిశ్రమను ఎంచుకుంటే ఆర్థికాభివృద్ధి సాధించొచ్చని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ కె.వెంకటనారాయణ పేర్కొన్నారు. తెలిపారు. ముదిగొండ మండలం పెద్దమండవలో శనివారం పశువుల్లో గర్భకోశ వ్యాధుల నివారణపై అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాగా, ఈ శిబిరంలో పశువులకు పరీక్షలకు నిర్వహించి మందులు అందజేశారు. అలాగే, కృత్రిమ గర్భధారణ పుట్టిన 64 మేలు జాతి గేదె దూడలను ప్రదర్శించగా మూడింటికి బహుమతులు అందజేశారు. జిల్లా పశుగణాభివృద్ధి ఈఓ డాక్టర్ కె.కిశోర్‌కుమార్, పశువైద్యాధికారులు ఎం.రమేష్‌బాబు, పి.అశోక్, సూపర్‌వైజర్ శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి వంటల పోటీలు

ఖమ్మంసహకారనగర్: ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన కుక్‌లు, హెల్పర్లకు ఆదివారం జిల్లా స్థాయి వంటల పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈఓ ఈ.సోమశేఖరశర్మ తెలిపారు. ఖమ్మంలోని అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్(యూఆర్ఎస్)లో జరిగే పోటీల్లో ఎంపిక చేసిన కుక్ కమ్ హెల్పర్లు పాల్గొంటారని వెల్లడించారు. మధ్యాహ్న భోజన నాణ్యతను పెంచే క్రమంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నామని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు.



సుడా మాస్టర్ ప్లాన్ ఏరియా మ్యాప్

పాత 'సుడా' పరిధిలోనే...

సుడా మాస్టర్ ప్లాన్‌పై వారం రోజుల్లో అధికారులతో సమావేశం నిర్వహిస్తాం. ప్రధానంగా కేఎంసీ కోసమే ఈ ప్లాన్ రూపొందిస్తున్నాం. కేఎంసీతో పాటు పాత సుడా పరిధిని దృష్టిలో పెట్టుకొని ప్లాన్ సిద్ధమవుతోంది.

– అభిషేక్ అగస్త్య, కేఎంసీ కమిషనర్, సుడా వైస్‌చైర్మన్



ఎట్టకేలకు కదలిక !

- 'సుడా' మాస్టర్ ప్లాన్ తుది ముసాయిదాపై కసరత్తు
- మెరుగులు దిద్దేందుకు త్వరలోనే సమావేశం
- ఈ నెలాఖరుకు సిద్ధం చేసేలా కార్యాచరణ

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌ను కలుపుకుని రూపొందిస్తున్న స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సుడా) మాస్టర్ ప్లాన్ తుది అంకానికి చేరుకుంటోంది. నాలుగేళ్లుగా మాస్టర్‌ప్లాన్‌పై అధికార యంత్రాంగం తర్జనభర్జన పడుతుండగా.. ప్రభుత్వ ఆదేశాలతో ఓ కొలిక్కి తీసుకొచ్చేందుకు కసరత్తు మొదలు పెట్టారు. ఈ నెలాఖరు వరకు ప్లాన్‌ను సిద్ధం చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలతో సుడా, కేఎంసీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. నాలుగేళ్ల క్రితం ప్లాన్ రూపకల్పన మొదలైనా రెండేళ్లుగా ఓ అడుగు ముందుకు.. రెండడుగులు వెనక్కి అన్న చందంగా సాగుతోంది. అయినా ఇప్పటివరకు ఆమోదం లభించకపోగా అంతా ఆశలు వదిలేసుకుంటున్న క్రమాన ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

పలుమార్లు భేటీలు

'సుడా' మాస్టర్ ప్లాన్‌పై రెండేళ్లుగా కసరత్తు జోరుగా సాగుతోంది. 2021 ఏడాదిలోనే మాస్టర్ ప్లాన్‌కు సంబంధించిన పనులు పూర్తి చేయాలని అధికారులు నిర్ణయించినా పలు కారణాలతో ఆగిపోయింది. ఓ ప్రైవేట్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుని మాస్టర్ ప్లాన్ తయారు చేయించారు. ఆతర్వాత ముసాయిదాపై 2022 ఫిబ్రవరి 11న స్టేక్ హోల్డర్లతో తొలిసారి సమావేశం నిర్వహించి అభిప్రాయాలు సేకరించారు. ఆ భేటీలో వచ్చిన సూచనలను పరిగణనలోకి తీసుకుని మరిన్ని మెరుగులు దిద్దాక అదే ఏడాది జూలై 1న రెండో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వచ్చిన సూచనలను సైతం ప్లాన్‌లో పొందుపరిచారు. ఆపై 2022 అక్టోబర్, నవంబర్‌ల్లోనే ప్లాన్ ముసాయిదా పబ్లిష్ చేయాల్సి ఉన్నప్పటికీ కొన్ని సవరణలు చేయాలనే కారణంతో వాయిదా వేస్తూ వచ్చారు. ఆ తర్వాత కూడా పలుమార్లు సమావేశాలు నిర్వహించినప్పటికీ 2023 ఏడాదిలో గత ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా పలు మున్సిపాలిటీలతో పాటు 'సుడా' మాస్టర్ ప్లాన్ ప్రక్రియకు బ్రేక్ వేసింది. దీంతో మొత్తంగా ప్లాన్ పక్కనపడినట్లేనని అంతా భావించారు.

వారం రోజుల్లో సమావేశం..

రాష్ట్ర వ్యాప్తంగా పలు కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు మాస్టర్‌ప్లాన్ రూపొందించేందుకు కేంద్రప్రభుత్వం అమృత్ పథకం కింద నిధులు మంజూరు చేసింది. ఇందులో భాగంగా రూ.కోటి నిధులతో సుడా మాస్టర్ ప్లాన్‌కు ప్రభుత్వం అనుమతించింది. అయితే, కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది డిసెంబర్ నెలాఖరుకు మాస్టర్ ప్లాన్ పూర్తిచేస్తేనే నిధులు మంజూరు చేస్తామని స్పష్టం చేసింది. దీంతో నిధులు వెనక్కి వెళ్లిపోకుండా ప్లాన్ పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తూ సుడా, కేఎంసీ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. ఈమేరకు వారం రోజుల్లో అధికారులు సమావేశమై తుది ముసాయిదా నివేదించనున్నట్లు సమాచారం.

పాత 'సుడా' పరిధిలో..

రాష్ట్ర ప్రభుత్వం సుడా పరిధిని విస్తరిస్తూ గత నెల ఆదేశాలు జారీ చేసింది. దీంతో కొత్త ప్రాంతాన్ని కలుపుతూ మాస్టర్ ప్లాన్ రూపొందిస్తారని అంతా భావించారు. కానీ ప్రభుత్వం మాత్రం పాత స్తంభాద్రి అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ(సుడా) పరిధిలోనే మాస్టర్ ప్లాన్ పూర్తి చేయాలని సూచించింది. దీంతో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌కు తోడు ఏడు మండలాల్లోని 46 గ్రామపంచాయతీలను కలుపుతూ ప్లాన్‌ను రూపొందిస్తారు. అయితే, భవిష్యత్ అవసరాల దృష్ట్యా గతంలో రూపొందించిన ప్రతిపాదనల్లో కొన్ని మార్పులు జరిగే అవకాశముందని స్టేక్ హోల్డర్లు అంచనా వేస్తున్నారు. అయినప్పటికీ అడ్డగోలు నిర్మాణాలకు అడ్డుకట్ట పడుతుందని.. ఆంక్షలు తొలగిపోతాయనే చర్చ జరుగుతోంది.

అన్నిరంగాల్లో అభివృద్ధే లక్ష్యం



బ్రిడ్జిని ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల, పక్కన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్, మేయర్ నీరజ తదితరులు

- రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- సారథినగర్ – మామిళ్లగూడెం ఆర్‌యూబీ ప్రారంభం

ఖమ్మం రాపర్తినగర్: ఖమ్మం నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే కాక సుందరీకరించడమే తన లక్ష్యమని, అందుకోసం కార్యాచరణ సిద్ధంగా ఉందని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఖమ్మంలోని మామిళ్లగూడెం – సారథినగర్ మధ్య రూ.1.90కోట్లతో నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జిని శనివారం ఆయన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్, మేయర్ పునుకొల్లు నీరజతో కలిసి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పేద ప్రజలకు ఉపయోగపడాలని తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే ఈ బ్రిడ్జిని మంజూరు చేయించానని తెలిపారు. మళ్లీ ఈ ఏడాది కాలంలో పనులు పూర్తిచేయించి ప్రారంభించడం ఆనందంగా ఉందని తెలిపారు. ఏటా జనాభా పెరుగుతున్నందున ప్రజలకు అన్ని వసతులు కల్పించేలా క్రమపద్ధతిలో అభివృద్ధి కోసం మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు మాస్టర్ ప్లాన్ రూపొందించాలని మంత్రి సూచించారు. అలాగే, వెలుగుమట్ల పార్క్‌ను మరింత అభివృద్ధి చేయనుండగా ఖిల్లాను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు రోప్ వే మంజూరు చేయించానని తెలిపారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ 50 శాతానికి ఎక్కువ జనాభా పట్టణాల్లో నివసిస్తున్నట్లు ఇటీవల సర్వేలో తేలిందన్నారు. కాగా, ఆర్‌యూబీ అందుబాటులోకి రావడంతో ప్రజల అవస్థ తీరనుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, జిల్లా అటవీ శాఖాధికారి సిద్దార్థ్ విక్రమ్‌సింగ్, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, కార్పొరేటర్లు కన్నం వైష్ణవి, దుద్దుకూరి వెంకటేశ్వర్లుతో పాటు బాలసాని లక్ష్మీనారాయణ, ఎర్రం బాలగంగాధర తిలక్, వడ్డెబోయిన నర్సింహారావు, నాగండ్ల దీపక్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీరభద్రం

మధిర: రాష్ట్రవ్యాప్తంగా రైతులందరికీ షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. మధిర మండలం మల్లారంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం తప్ప ప్రజా సమస్యలపై చర్చించి పరిష్కరించే ప్రయత్నం జరగడంలేదని విమర్శించారు. ఈమేరకు ప్రజలు తమ సమస్యలపై చర్చించుకుని పోరాడితే పరిష్కారమవుతాయని తెలిపారు. నిస్వార్థంగా ప్రజా సమస్యలపై కమ్యూనిస్టులు మాత్రమే ఉద్యమిస్తుండడంతో ఎర్ర జెండాకు ఆదరణ పెరుగుతోందని చెప్పారు. కాగా, లెక్కలేనన్ని హామీలు ఇచ్చిన ప్రభుత్వం ఇప్పుడు అమలుచేయకపోవడంతో ప్రజల విశ్వాసాన్ని కోల్పోతోందని తమ్మినేని వెల్లడించారు. అయితే, హామీలు నెరవేర్చే వరకు ఎర్రజెండా ఉద్యమిస్తుందని తెలిపారు. రాబోయే రోజుల్లో కమ్యూనిస్టులపై బాధ్యత పెరగనున్నందున పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని వీరభద్రం పిలుపునిచ్చారు.

వివరాల సేకరణలో పొరపాట్లు జరగొద్దు

- 'ఇందిరమ్మ' యాప్‌పై అవగాహన ఉండాలి
- ఉద్యోగుల శిక్షణలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం సహకారనగర్: ఇందిరమ్మ ఇళ్ల యాప్ ద్వారా క్షేత్ర స్థాయి వివరాల సేకరణలో పొరపాట్లకు తావులేకుండా చూడాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, మునిసిపల్ కమిషనర్లకు యాప్‌పై శిక్షణ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులెవరూ నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత యంత్రాంగంపై ఉందని తెలిపారు. దరఖాస్తులను నిశితంగా పరిశీలిస్తూ ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు యాప్‌లో వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఏయే ఆధారాలు పరిశీలించాలి, యాప్‌లో ఏమేం పొందుపర్చాలో అవగాహన పెంచుకుని ప్రతిరోజు కనీసం 30 దరఖాస్తుల పరిశీలన పూర్తిచేయాలని తెలిపారు. తద్వారా ఈనెల 20వ తేదీ నాటికి వివరాల సేకరణ ముగించాలని కలెక్టర్ సూచించారు. ఆతర్వాత ఈడీఎం దుర్గాప్రసాద్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, డీఆర్వో రాజేశ్వరి, జెడ్పీ సీఈఓ దీక్షారైనా, డీఆర్డీఓ సన్యాసయ్య, డీసీఓ ఆశాలత, ఆర్డీఓలు నర్సింహారావు, ఎల్.రాజేందర్, హౌజింగ్ ఈఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్రూప్-2 పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు

ఈనెల 15, 16వ తేదీల్లో జరగనున్న గ్రూప్–2 పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల పాటు ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో జరిగే పరీక్షకు జిల్లాలో 85 కేంద్రాలు గుర్తించామని వెల్లడించారు. అభ్యర్థులు ఈనెల 9వ తేదీ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. చెప్పులు మాత్రమే వేసుకురావాలని, షూస్ వేసుకొస్తే అనుమతించరని తెలిపారు. అలాగే, హాల్ టికెట్‌పై ఫొటో స్పష్టంగా లేకపోతే మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలను గెజిటెడ్ అధికారి లేదా చివరిసారి చదివిన కళాశాల ప్రిన్సిపాల్‌తో అటెస్టేషన్ చేయించి తీసుకురావాలని సూచించారు. దివ్యాంగ అభ్యర్థులు అర్హత కలిగిన స్క్రైబ్, ఇతర వివరాలను పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌కు సమర్పించాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు.

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారికి శనివారం సువర్ణ తులసీ అర్చన వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున అంతరాలయంలో మూలమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన స్వామి వారిని పల్లకీ సేవగా బేడా మండపానికి తీసుకొచ్చారు. అర్చకులు ముందుగా ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ తంతును కన్నులపండువగా జరిపించారు. స్వామి వారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు.



కల్యాణతంతు నిర్వహిస్తున్న అర్చకులు

ఏసీ బస్సుల్లో 10 శాతం రాయితీ

ఖమ్మంమయూరిసెంటర్: టీజీఎస్‌ఆర్టీసీ అన్ని ఏసీ బస్సుల్లో బేసిక్ టికెట్ చార్జీపై 10 శాతం రాయితీ ఇస్తున్నట్లు ఖమ్మం రీజినల్ మేనేజర్ ఎ.సరిరామ్ తెలిపారు. లహరి ఏసీ స్లీపర్, రాజధాని బస్సుల్లో ఈ నెల 31 వరకు రాయితీ అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు టికెట్ ధర రూ.490 ఉండగా, రాయితీతో రూ.450కు తగ్గుతుందని, ఖమ్మం నుంచి విశాఖపట్నానికి రూ.1,020గా ఉన్న టికెట్ ధర రూ.930గా అమలవుతుందని తెలిపారు. సత్తుపల్లి నుంచి బీహెచ్ఐఎల్‌కు నడుస్తున్న ఏసీ బస్సుల్లో టికెట్ రూ.730 నుంచి రూ.670కి, భద్రాచలం నుంచి హైదరాబాద్‌కు వెళ్లే ఏసీ బస్సుల్లో రూ.770 నుంచి రూ.700కు, పాల్వంచ నుంచి మియాపూర్‌కు రూ.770 గా ఉన్న టికెట్ ధర రూ.710గా తగ్గుతుందని ఆర్ఎం వివరించారు.

- విద్య, వైద్యం, వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి
- మౌలిక వసతుల కల్పనకు పెద్దమొత్తంలో నిధులు

ఏడాది పాలనపై వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

హామీల అమలు దిశగా...



వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా: ఎంతో నమ్మకంగా గెలిపించిన ప్రజల ఆశలు వమ్ము కాకుండా వారి సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నానని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ వెల్లడించారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీలే కాక చెప్పని పనులు సైతం చేస్తూ నిత్యం ప్రజలకు అండగా నిలుస్తున్నానని తెలిపారు. ఎమ్మెల్యేగా గెలిచి ఏడాది పూర్తయిన సందర్భంగా శనివారం 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఎమ్మెల్యే వెల్లడించిన వివరాలు ఆయన మాటల్లోనే...

పూర్తి సమయం ప్రజల్లోనే..

గెలిచిన ఏడాదిగా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే క్రమంలో పూర్తి సమయం కేటాయిస్తున్నా. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా వైరా రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలు ఎత్తిపోసేందుకు ఏళ్లుగా ఎదురుచూస్తుండగా, ప్రస్తుతం కేటాయించిన రూ.100 కోట్ల నిధులతో పనులు జరుగుతున్నాయి. అలాగే, వందేళ్లు పూర్తయిన వైరా రిజర్వాయర్ ఆధునీకీకరణను దివంగత సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి తర్వాత ఎవరూ పట్టించుకోలేదు. మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రూ.42 కోట్లు మంజూరయ్యాయి. నియోజకవర్గ కేంద్రంలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి రూ.37.50 కోట్ల నిధులు వచ్చాయి. వైరా మున్సిపాలిటీ పరిధిలో అమృత్ పథకం ద్వారా మంజూరైన రూ.25 కోట్లతో ట్యాంకులు, పైపులైన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. వైరా నదిపై స్నానాల లక్ష్మీపురం వద్ద చెక్‌డ్యాం, కరకట్టల నిర్మాణానికి రూ.12 కోట్లు నిధులు మంజూరయ్యాయి. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో పీఆర్ నుంచి రహదారుల నిర్మాణానికి రూ.50 కోట్లు, ఆర్‌అండ్‌బీ శాఖ నుంచి రూ.25కోట్లు సాధించా. వైరా మున్సిపాలిటీ పరిధి వైరా – సోమవరం మధ్య రహదారి విస్తరణ, సెంట్రల్ లైటింగ్, డివైడర్లు, సైడ్ డ్రెయిన్ల నిర్మాణ పనులు రూ.12 కోట్ల వ్యయంతో జరుగుతున్నాయి. ఐటీడీఏ ద్వారా కారేపల్లి, ఏన్కూరు, జూలూరుపాడు మండలాల్లో రూ.9 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాం. కొణిజర్ల నుండి పెద్దగోపతి వరకు రోడ్డు విస్తరణ పనులు రూ.10కోట్లతో పూర్తిచేశాం.

మౌలిక సదుపాయాల కల్పన

నియోజకవర్గ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేలా మంత్రుల దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయిస్తున్నా. రానున్న నాలుగేళ్లలోనూ మరిన్ని నిధులు తీసుకొస్తా. వైరా రిజర్వాయర్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేలా రిసార్టులు, హోటళ్లు, రిక్రియేషన్ క్లబ్‌ల నిర్మాణం, స్పీడ్ బోట్ల ఏర్పాటుకు రూ.100 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశాం. వైరా మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.100కోట్లు కేటాయిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినందున ఈ నిధులతో రహదారులు, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ, కమ్యూనిటీ హాళ్లు, పార్కుల నిర్మాణం చేపడతాం. కొణిజర్ల మండలం తనికెళ్ల నుండి వైరా మున్సిపాలిటీ పరిధిలోని గండుగలపాడు సాయిబాబా ఆలయం వరకు రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్, డివైడర్ల నిర్మాణానికి రూ.50 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశాం. పల్లిపాడు నుండి ఏన్కూరు మధ్య ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటు చేస్తా. వైరాలో 20 ఎకరాల విస్తీర్ణంలో రూ.125కోట్లతో శంకుస్థాపన జరగనుంది. సీతారామ ప్రాజెక్టు ద్వారా కారేపల్లి మండలంలో అన్ని చెరువులకు గోదావరి జలాలు తరలించే పనులకు రూ.200 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు రూపొందించాం. అలాగే, జూలూరుపాడు మండలంలోని అన్ని గ్రామాలకు సీతారామ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కెనాళ్ల ద్వారా సాగునీరు ఇవ్వడంతో పాటు నియోజవర్గ కేంద్రంలో అగ్రికల్చరల్ పాలిటెక్నికల్ కళాశాల, డిగ్రీ, నర్సింగ్, ఐటీఐ ఏర్పాటుచేయాలని ప్రభుత్వాన్ని కోరాను. కొణిజర్ల మండలం పెద్దగోపతి వద్ద సాగర్ కాల్వపై లిఫ్ట్ ఏర్పాటుచేస్తే సుమారు 20వేల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశమున్నందున మంత్రుల దృష్టికి తీసుకెళ్లాను.

క్లుప్తంగా

నేడు పెన్షనర్ల సదస్సు



మాట్లాడుతున్న పుల్లయ్య

ఖమ్మంసహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు ఆదివారం సదస్సు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్‌దారుల సంఘం జిల్లా అధ్యక్షుడు పరిశ పుల్లయ్య తెలిపారు. ఖమ్మంలోని జెడ్పీ గెస్ట్ హౌస్‌లో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జెడ్పీ సమావేశ మందిరంలో జరిగే సదస్సుకు రాష్ట్ర అధ్యక్షుడు అరివ్వాణి రాజేంద్రబాబు తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. ఈ మేరకు పెన్షనర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు కనపర్తి వెంకటేశ్వర్లు, పెదమళ్ల సత్యనారాయణ, రాయల రవికుమార్, వీరభద్రరావు, భాస్కరాచారి, అబ్దుల్ జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సౌకర్యాలతో రాణించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ మ్రిణాల్

ఖమ్మంఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు చదువులో రాణించాలని అసిస్టెంట్ కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ఠ సూచించారు. ఖమ్మం వేణుగోపాల్ నగర్‌లోని పాఠశాలను శనివారం తనిఖీ చేసిన ఆయన యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకం అమలుపై ఆరాతీశారు. అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద చేపట్టిన పనులను పరిశీలించడమే కాక విద్యార్థుల ప్రగతిని పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. హెచ్ఎం గుడిపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌ఫేర్‌లో విద్యార్థిని ప్రతిభ



శ్రీముఖి రఘుమయి

భద్రాచలంటౌన్: పట్టణంలోని లిటిల్ ఫ్లవర్స్ విద్యార్థిని వనం శ్రీముఖి రఘుమయి జిల్లాస్థాయిలో ప్రజ్ఞ కాంపిటీషన్ సైన్స్‌ఫేర్ విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచింది. బహుమతితోపాటు ప్రశంసా పత్రం అందుకుంది. దీంతో పాఠశాల యాజమాన్యంతో పాటు పలువురు విద్యార్థిని అభినందించారు.

నర్సింగ్ కళాశాలలో ఉద్యోగాలకు దరఖాస్తులు

ఖమ్మంరూరల్: మండలంలోని పెదతండాలోని నర్సింగ్ కళాశాలలో ఔట్ సోర్సింగ్ విధానంపై ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.రత్నకుమారి తెలిపారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుకు డిగ్రీ, పీజీడీసీఏ పూర్తిచేసిన వారు, వార్డెన్ పోస్టుకు డిగ్రీ, ఎలక్ట్రీషియన్, మెకానిక్ పోస్టులకు ఐటీఐ పూర్తిచేసిన వారు అర్హులని వెల్లడించారు. ఇవేకాక ఆఫీస్ సబార్డినేట్, డ్రైవర్, శానిటేషన్ వర్కర్, కుక్ పోస్టులకు సైతం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

గిరిజన పాఠశాలలో డీడీ పరిశీలన



విద్యార్థుల ప్రగతిని పరీక్షిస్తున్న డీడీ విజయలక్ష్మి

కారేపల్లి: మండలంలోని లావుడ్యాతండాలో గిరిజన సంక్షేమ శాఖ ప్రాథమిక పాఠశాలను డిప్యూటీ డైరెక్టర్ విజయలక్ష్మి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాఠాలు చదివించి చతుర్విధ ప్రక్రియలు, తదితర అంశాల్లో సామర్థ్యాలను పరీక్షించారు. ఐటీడీఏ ఆధ్వర్యాన రూపొందించిన ఉద్దీపకము పుస్తకాల పంపిణీపై ఆరా తీసిన డీడీ, వీటి ద్వారా బోధనపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శాఖ ఉద్యోగి బాల, హెచ్ఎం కేలోతు రాములు పాల్గొన్నారు.

రెండు తలల పాము అప్పగింత

తల్లాడ: తల్లాడలోని ముస్లింబజార్‌లో రెండు తలల పాము (శిఖండి) తిరుగుతుండగా స్థానికులు శనివారం గుర్తించారు. వీడీసీ మాజీ చైర్మన్ దగ్గుల శ్రీనివాసరెడ్డి, రాము అటవీ ఉద్యోగులకు సమాచారం ఇచ్చారు. దీంతో తల్లాడ బీట్ ఆఫీసర్ డి.సైదులు చేరుకుని రెండు తలల పామును స్వాధీనం అటవీ ప్రాంతంలో వదిలేందుకు తీసుకెళ్లారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,413



సర్దార్ పటేల్ స్టేడియంలోని ట్రాక్‌పై ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులు

'ట్రాక్' తప్పినట్లేనా?

సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ అటకెక్కినట్టేనా?!

- రూ.8.50 కోట్లు మంజూరైనా పనుల్లో జాప్యం
- పట్టించుకోని జిల్లా ప్రజాప్రతినిధులు
- కల ఎప్పుడు నెరవేరుతుందోనని క్రీడాకారుల ఎదురుచూపులు

ఖమ్మంస్పోర్ట్స్: జిల్లా కేంద్రంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ గత ప్రభుత్వ హయాంలో మంజూరైంది. అయితే, ఇప్పటివరకు కూడా నిర్మాణ పనులు చేపట్టకపోవడంతోనే అరకొర వసతుల నడుమ సాధారణ ట్రాక్‌పైనే క్రీడాకారులు ప్రాక్టీస్ చేయాల్సి వస్తోంది. జిల్లాలోనే తొలిసారిగా సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ మంజూరు చేయగా.. గత ప్రభుత్వం రూ.6.కోట్లను ఆరు లేన్ల ట్రాక్ నిర్మాణానికి కేటాయించింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దీన్ని రద్దు చేసి అదనంగా రూ.2.50 కోట్లు కలిపి రూ.8.50 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది. అత్యాధునిక వసతులతో ట్రాక్ నిర్మాణానికి నిధులు పెంచేలా రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవ తీసుకోవడంపై క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు. అయితే, పనుల్లో మాత్రం అడుగు ముందుకు పడకపోవడంతో వారిలో నిరుత్సాహం అలుముకుంటోంది.

పట్టించుకోని ప్రజాప్రతినిధులు

పటేల్ స్టేడియానికి సింథటిక్ ట్రాక్ మంజూరు, నిధుల కేటాయింపులో చొరవ తీసుకోవడం లేదని, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో జరిగే క్రీడా పోటీల సభల్లో ఎంతో చేశాం.. ఇంకా ఎంతైనా చేస్తామని చెప్పే నేతలు మంజూరైన ట్రాక్ నిర్మాణం విషయాన్ని పట్టించుకోకపోవడాన్ని పలువురు తప్పుపడుతున్నారు. మరోపక్క సింథటిక్ ట్రాక్ నిర్మాణానికి కేటాయించిన నిధులను మరో క్రీడా పనులకు వెచ్చించనున్నట్లు జరుగుతున్న ప్రచారంతో క్రీడాకారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

ఎందరో జాతీయస్థాయి క్రీడాకారులు

జిల్లా నుంచి ఎందరో క్రీడాకారులు అథ్లెటిక్స్ విభాగంలో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయస్థాయిలో సత్తా చాటారు. వీరంతా ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో శిక్షణ తీసుకున్న వారే కావడం విశేషం. ఈ నేపథ్యాన ఔత్సాహిక క్రీడాకారులకు మెరుగైన శిక్షణ ఇస్తే మంచి ఫలితాలు వస్తాయనే భావనతో సింథటిక్ ట్రాక్‌ను మంజూరు చేసినా పనులు చేపట్టకపోవడంతో నిరాశ చెందుతున్నారు. రాష్ట్రంలోని పేరెన్నికగన్న కోచ్ ఇక్కడ ఉన్నప్పటికీ సాధారణ ట్రాకే కావడంతో కొంత మేర నిరాశజనకమైన ఫలితాలు వస్తున్నాయి. ఈ నేపథ్యాన సింథటిక్ ట్రాక్ నిర్మాణానికి చొరవ చూపాలని డిమాండ్ చేస్తున్నారు.

పనులు అప్పగించాల్సి ఉంది..



సర్దార్ పటేల్ స్టేడియంలో సింథటిక్ ట్రాక్ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లకు అప్పగించడమే మిగిలి ఉంది. సింథటిక్ ట్రాక్ నిర్మాణంపై వస్తోన్న అపోహలను ఎవరూ నమ్మొద్దు. టెండర్లు ఖరారు కాగానే త్వరగా పనులు పూర్తయ్యేలా పర్యవేక్షిస్తాం.

–టి.సునీల్‌కుమార్‌రెడ్డి, డీవైఎస్ఓ

డిప్యూటీ సీఎంను కలిసిన సంఘాల నాయకులు



డిప్యూటీ సీఎం భట్టిని సన్మానిస్తున్న నాయకులు

ఖమ్మంసహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేయిస్తున్న నేపథ్యాన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు వివిధ సంఘాల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. టీజీఈ జేఏసీ వైస్ చైర్మన్, ఎస్‌టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొండ సైదులు ఆధ్వర్యాన జేఏసీ నాయకులు తెలంగాణ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం, తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం బాధ్యులు శనివారం హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎంను కలిశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు డెడికేటెడ్ బీసీ కమిషన్ ఏర్పాటు చేసి అభిప్రాయాలు సేకరిస్తుండటం ఆనందంగా తెలిపారు. కార్యక్రమంలో టీజీఈ జేఏసీ చైర్మన్, ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్, ఏలూరు శ్రీనివాసరావు, ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పోచయ్యతో పాటు వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

'మా పోరాటంతోనే నవోదయ విద్యాలయాలు'

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్ఎస్ పోరాట ఫలితంగానే తెలంగాణకు ఏడు నవోదయ విద్యాలయాలు మంజూరయ్యాయని మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణకు 21 నవోదయ విద్యాలయాలను మంజూరు చేయాలని తాము కోరితే కేంద్రం ఏడింటిని ఇచ్చిందని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడ్డాక కొత్త జిల్లాలను ఏర్పాటు చేయగా, తాము నూతన జిల్లాల్లో నవోదయ విద్యాలయాలు ఏర్పాటు చేయాలని పలుమార్లు డిమాండ్ చేశామని తెలిపారు. ప్రస్తుతం మంజూరైన ఏడు నవోదయ విద్యాలయాలతో రాష్ట్రంలో వీటి సంఖ్య 16కి చేరిందని వెల్లడించారు.

చెరుకు రైతుల సంక్షేమమే లక్ష్యం



చెరుకు క్రషింగ్‌ను ప్రారంభిస్తున్న ఫ్యాక్టరీ యాజమాన్యం

నేలకొండపల్లి: చెరుకు రైతుల సంక్షేమమే మధుకాన్ షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం లక్ష్యమని అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ వై.కోటయ్య తెలిపారు. మండలంలోని రాజేశ్వరపురం ఫ్యాక్టరీలో 2024–25 సీజన్‌కు గాను క్రషింగ్‌ను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గత సీజన్‌లో 2,31,270 లక్షల మెట్రిక్ టన్నుల చెరుకు గానుగ ఆడించి 9.90 శాతం రికవరీ సాధించామన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు అదనంగా రూ.116 కలిపి గత సీజన్ కంటే టన్నుకు రూ.210 అదనంగా చెల్లించనున్నామని తెలిపారు. కొత్తగా చెరుకు వేసే రైతులకు ఎకరాకి మూడు టన్నుల విత్తనం లేదా రూ.10,200 విలువైన నర్సరీ మొక్కలను ఇస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో కేన్ అసిస్టెంట్ కమిషనర్, చెరుకు అభివృద్ధి మండలి చైర్మన్లు జూకూరి గోపాల్‌రావు, విష్ణువర్ధన్‌రెడ్డి, రైతు ప్రతినిధులు అడపాల రమేశ్, చింతనిప్పు సైదులు, అంజిరెడ్డి, గోపాల్‌రావు, యడవల్లి నాగరాజు, రచ్చా నర్సింహారావు, బోనగిరి కిరణ్, మంకెన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక, శారీరక ఉల్లాసం



సీఎం కప్ అక్షరాల ఆకారంలో విద్యార్థులు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీవైఎస్ఓ సునీల్‌రెడ్డి

డీవైఎస్ఓ సునీల్‌రెడ్డి

కొణిజర్ల: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించడం ద్వారా మానసిక, శారీరక ఉల్లాసం సొంతమవుతుందని జిల్లా యువజన క్రీడా శాఖాధికారి తుంబూరు సునీల్‌రెడ్డి తెలిపారు. జిల్లావ్యాప్తంగా శనివారం గ్రామస్థాయి సీఎం కప్ క్రీడాపోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను కొణిజర్ల మండలం తనికెళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో తర్ఫీదు పొందితే భవిష్యత్ ఉద్యోగావకాశాల్లో ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. అనంతరం విద్యార్థులు సీఎం కప్ అక్షరాల రూపంలో కూర్చుని ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి అబ్రహం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిజిటల్ అరెస్ట్ పేరిట రూ.15 లక్షలు స్వాహా

భయంతో నిందితుల ఖాతాలో జమ చేసిన రిటైర్డ్ ఉద్యోగి

వైరా: విమాన టికెట్లు ఎందుకు బుక్ చేసుకున్నారు.. గుర్తు తెలియని ఖాతాల నుంచి నగదు జమ అయిన విషయం సీబీఐకి తెలిసింది.. అంటూ బెదిరించిన సైబర్ నేరగాళ్లు ఓ రిటైర్డ్ ఉద్యోగి నుంచి రూ.15 లక్షల జమ చేయించుకున్నారు. మరోమారు నగదు స్వాహాకు యత్నించగా కుటుంబీకులకు చెప్పడంతో అడ్డుకట్ట పడినట్లయింది. వివరాలిలా ఉన్నాయి.. ఖమ్మం జిల్లా వైరా గాంధీనగర్‌లో నివాసముండే రిటైర్డ్ ఉద్యోగి ఉటుకూరు నర్సింహారావుకు శుక్రవారం వాట్సప్ కాల్ ద్వారా ఓ వ్యక్తి మాట్లాడారు. ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ నుంచి ఫోన్ చేసినట్లు చెబుతూ ఐదు విమాన టికెట్లు బుక్ చేసిన టికెట్ల వివరాలు చెప్పాలని సూచిస్తూ సీబీఐ అధికారులు వీడియోకాల్‌లో మాట్లాడుతారని చెప్పాడు. హిందీ, ఇంగ్లిష్, తెలుగు భాషల్లో మాట్లాడిన సదరు వ్యక్తి తీరుతో నర్సింహారావు అయోమయానికి గురయ్యాడు. అంతేకాక ఖాతాలోకి హవాలా రూపంలో నగదు బదిలీ అయినందున విచారణ చేపట్టాలని, సుప్రీంకోర్టు అధికారులు సైతం లైన్‌లోకి రానున్నందున బయట ఎవరికీ చెప్పొద్దని సూచించారు. ఇక శనివారం ఉదయం కూడా వాట్సప్ కాల్ చేసిన సదరు వ్యక్తి కేసు లేకుండా చూసేందుకు రూ.15 లక్షలు చెల్లించాలని సూచించగా నర్సింహారావు తన ఖాతా నుంచి కలకత్తాలోని బంధన్ బ్యాంకులో రామ ఎంటర్‌ప్రైజెస్ పేరిట ఉన్న ఖాతాకు నగదు బదిలీ చేశాడు. ఆపై మరోసారి సుప్రీంకోర్టు ఆడిటర్‌కు ఇచ్చేందుకు రూ.5 లక్షలు చెల్లించాలని, లేకపోతే అరెస్టు ఖాయమని చెప్పడంతో ఆయన కుటుంబీకులకు తెలిపాడు. దీంతో వారు వైరా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా రాష్ట్రస్థాయి సైబర్ క్రైం సెల్‌కు సమాచారం ఇచ్చారు. కాగా, అన్నీ తెలిసిన తాను సైబర్ నేరగాళ్ల విషయమై బంధువులకు అవగాహన కల్పిస్తుంటానని.. ఇప్పుడు తానే వారి వలలో పడ్డానని నర్సింహారావు వాపోయారు.

ఎయిర్‌గన్‌తో బావమరిదిపై కాల్పులు

- పిల్లెట్ తొడభాగంలో దిగడంతో తీవ్ర గాయం
- ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన

పాల్వంచ: బావ, బావమరిది మధ్య తలెత్తిన వివాదంలో బావ ఎయిర్‌గన్‌తో కాల్చడంతో బావమరిదికి తీవ్ర గాయాలైన ఘటన పాత పాల్వంచలో శనివారం ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసుల కథనం మేరకు.. పాత పాల్వంచకు చెందిన సిరాజ్ మహమ్మద్ సోదరి నజీమత్ హేరాకు తిరుమలాయపాలెం మండలం కాకరవాయి గ్రామానికి చెందిన జిలానీతో గతంలో వివాహం జరిగింది. కాగా జిలానీ తరచూ మద్యం సేవించి నజమత్‌ను ఇబ్బంది పెట్టడంతో పాటు వివాహ సమయంలో కట్నం సరిగా ఇవ్వలేదని దూషిస్తుండేవాడు. దీంతో సిరాజ్ తన అక్కతో కలిసి కొంత కాలం తిరుమలాయపాలెంలో హోటల్ నడపగా జిలానీ అక్కడికి కూడా వచ్చి ఇబ్బంది పెడుతుండేవాడు. దీంతో మూడు నెలల క్రితం అక్కా, తమ్ముడు పాత పాల్వంచకు వచ్చేశారు. కాగా శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో జిలానీ, శ్రీకాంత్ అనే మరో వ్యక్తితో కలిసి కారులో వచ్చి సిరాజ్‌తో గొడవపడ్డాడు. ఈ క్రమంలో తన వెంట తెచ్చుకున్న ఎయిర్‌గన్‌తో సిరాజ్‌పై మూడు రౌండ్లు కాల్పులు జరిపాడు. రెండుసార్లు తప్పిపోగా మూడోసారి పిల్లెట్ తొడభాగంలో దిగడంతో గాయమైంది. సిరాజ్ గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చేసరికే జిలానీ కారులో పరారయ్యాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు జిలానీ, శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసినట్టు పాల్వంచ ఎస్ఐ సుమన్ తెలిపారు.

అండర్-14 ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు

ఖమ్మంస్పోర్ట్స్: ఉమ్మడి ఖమ్మం జిల్లాస్థాయి అండర్–14 బాలుర క్రికెట్ జట్టును ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో శనివారం ఎంపిక చేశారు. ఈ జట్టు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహించే టోర్నీలో పాల్గొంటుందని క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చేకూరి వెంకట్, కోఆర్డినేటర్ ఎండీ మసూద్‌పాషా తెలిపారు. జట్టుకు ఎస్‌కే ఉజర్, వి.దీక్షిత్, సీహెచ్ సాయికార్తీక్, దిశన్‌రాహుల్, ఎ.సాయిసాకేత్, రాషారీ, ఎస్.హ్రిషికేశ్, జి.ధన్‌దారా, పి.జైగణేశ్, టి.రుత్విక్, ఎల్.హిహాస్‌రెడ్డి, కె.శివరెడ్డి, ఎండీ అమన్, ఎన్.చైతన్యకృష్ణ, కె.శివారెడ్డి, ఎ.ద్విపద్‌నాయక్, బి.తనిష్క్, కె.ధనుష్, జి.జైరాంచరణ్ ఎంపికయ్యారని, జట్టుకు ఎండీ ఫారుఖ్ కోచ్‌గా వ్యవహరిస్తారని వెల్లడించారు.

పంట అవశేషాలను కాల్చొద్దు..



అనంతసాగర్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న డీఏఓ పుల్లయ్య

చింతకాని: వరి కోతలు పూర్తయ్యాక రైతులు పంట అవశేషాలను కాల్చొద్దని జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య సూచించారు. మండలంలోని అనంతసాగర్, జగన్నాథపురం, చింతకానిల్లో శనివారం పర్యటించిన ఆయన రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ.. పత్తి, వరి పంటల అవశేషాలను భూమిలో కలియదున్నితే లాభాలు ఉంటాయని తెలిపారు. అలాకాకుండా కాలిస్తే మేలు చేసే సూక్ష్మజీవులు చనిపోతాయని చెప్పారు. ఈ మేరకు రైతులు పంట అవశేషాలను రోటోవేటర్ సాయంతో భూమిలో కలియదున్నితే సేంద్రియ కర్బనం పెరగడమే కాక వాతావరణ కాలుష్యం తగ్గుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ మానస, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

యంత్రాల పనితీరు పరిశీలన



యంత్రాల పనితీరును పరిశీలిస్తున్న ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి

దమ్మపేట: మండల పరిధిలోని అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో యంత్రాల పనితీరును, అధికారులతో కలిసి టీజీ ఆయిల్ ఫెడ్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి పరిశీలించారు. శనివారం ఫ్యాక్టరీని సందర్శించిన ఆయన గెలల క్రషింగ్, వివిధ విభాగాల్లో రోజువారీ కార్యకలాపాలను పర్యవేక్షించారు. కాండం పొడవు తక్కువ ఉండేలా పామాయిల్ గెలలను నరకాలని అన్నారు. వార్షిక మరమ్మతుల ప్రక్రియలో భాగంగా యంత్రాల సామర్థ్యం, పనితీరును పరిశీలించారు. మార్చాల్సిన యంత్రాల విడి భాగాలపై నివేదిక రూపొందించాలని సూచించారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ మేనేజర్ కళ్యాణ్, కార్తీక్, రాజేష్, శివ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

కోల్డ్ స్టోరేజీలో చోరీ

మధిర: మండలంలోని దెందుకూరు సమీపాన ఉన్న కోల్డ్ స్టోరేజీలో శనివారం తెల్లవారుజామున చోరీ జరిగింది. ప్యాసింజర్ ఆటోలో వచ్చిన దుండగులు కోల్డ్ స్టోరేజీ పక్కన ఆపి ప్రహరీ నుంచి దూకి మిర్చి బస్తాలను తెచ్చే ప్రయత్నం చేశారు. ఒక మిర్చి బస్తాను ఆటోలోకి ఎక్కించాక మధిర – విజయవాడ రహదారిపై వెళ్తున్న ఓ వ్యక్తి కోల్డ్ స్టోరేజ్ మేనేజర్‌కు ఫోన్ చేయడంతో ఆయన వాచ్‌మెన్‌ను అప్రమత్తం చేశాడు. దీంతో సిబ్బంది వస్తుండగా దుండగులు పరారయ్యారు. అప్పటికే విద్యుత్ మోటార్లు, మిర్చి బస్తా, మరికొంత సామగ్రిని ఆటోలో వేసుకుని వెళ్లిపోయినట్లు తెలిసింది. దీంతో సీసీ కెమెరాల పుటేజీని సీఐ డి.మధు, ఎస్ఐ లక్ష్మీభార్గవి పరిశీలించి కోల్డ్ స్టోరేజీ మేనేజర్ అప్పారావు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేపట్టారు.

ఆటోను ఢీకొట్టిన కారు..

- ఒకరు మృతి

కూసుమంచి: ఖమ్మం – సూర్యాపేట జాతీయ రహదారిపై కూసుమంచి మండలం గురువాయిగూడెం క్రాస్ వద్ద శనివారం సాయంత్రం ఆటోను వెనుక నుంచి కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోడ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. నాయకన్‌గూడేనికి చెందిన కూరగాయల వ్యాపారి బానోత్ సుందర్‌నాయక్ (35).. తమ చేలో పండిన కూరగాయలతో నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురం సంతకు బయలుదేరాడు. ఆటోలో ఆయన భార్య కూడా ఉండగా, గురువాయిగూడెం క్రాస్ వద్ద సూర్యాపేట నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న కారు అతివేగంగా ఢీకొట్టింది. సుందర్ రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతిచెందాడు. కారుడ్రైవర్ పరారయ్యాడు. సుందర్ భార్య ఫిర్యాదుతో ఎస్ఐ నాగరాజు చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కాగా, సుందర్‌నాయక్ తండ్రి బాలునాయక్ ఐదేళ్ల కిందట రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు.